# పండుగ




**కొలనుపాక మురళీధరరావు**

**ఆ**శ్వీయుజ కార్తీక మార్గశిర మాసాలు శారదమ్మ గార్కి చాలా ఇష్టం. పూర్వ కాలం నుండి తమ ఆచార- సంప్రదాయాలను కాపాడు కుంటూ రావాలనే తపన గల స్త్రీ. తెల్లవారుజామున లేస్తుంది. "శుక్లాం భరధరం" శ్లోకంతో ప్రార్ధన మొదలు పెట్టి దాదాపు గంటసేపు పూజా మందిరంలో గడిపి, "శ్రీనివాసాయానిత్య మంగళం"తో ప్రాతఃకాల పూజ ముగిస్తుంది.

ఇంతలో "పాలండీ" అంటూ కేక. చేయాల్సిన కాఫీ, టీలను గుర్తు చేస్తుంది. పాలవాడి కేకతో పాటు.

అమ్మగారు ! అంట్లు వేస్తారా !...

పని మనిషి ఊడ్పులు, కడగటాలు ఇంటిల్లిపాదిని లేపే ప్రయత్నం చేస్తాయి.

"ఏంటే, అంత పెద్ద గొంతుకతో అరుస్తావేంటి రోజు ఉండే అంట్లే గదా ! నీవు చెప్పకుంటే నేను వేయనా ఏంటీ, నీ కేకలతో పడుకున్న వాళ్ళను లేపేటట్లు ఉన్నావు" !

చూడండీ! పెద్దమ్మగారూ కాస్త తొందర పెడితేనే పనులు తెమలవండీ! మీ ఇల్లు ఒక్కటే కాదుగదా! పండుగరోజులు వస్తున్నాయాయె. అందరూ ఒకేసారి పది పనులు చెప్తారు.

ఏమేవ్ ! ఇంకా కాఫీ కాలేదా? అప్పుడే పేపరు వచ్చినట్టుంది. రామ నాథంగారు కాఫీ రాగం పాడారు.

ఆc ! వస్తున్నా ! ఒక్కక్షణం

ఏంటీ కాఫీ ఇంత పలుచగా ఉంది, పాలు చిక్కగా లేనట్టుంది. పాలవాడ్ని మారిపించేద్దాం.

అలాగే !

"అమ్మా ! 'బోర్నవీటా' అంటూ..... చిన్న కూతురు శైలజ వచ్చింది.

ఇంకా చిన్నపిల్ల మాదిరిగా బోర్నవిటా ఏంటే, అన్న భాస్కర్ చేతిలో ఇంగ్లీష్ పేపరు పట్టుకొని అనడంతో

చూడవే అమ్మా ! పొద్దునే తన పెద్దరికం మొదలుపెట్టాడు.

మీ ఇద్దరికి రోజు వున్న సంగతే గదా ! నాకు బోల్డు పన్లు ఉన్నాయి. అంటూ అక్కడి నుండి జారుకుంది శారదమ్మ.

అత్తయ్యా ! టిఫిను ఏం చేయమంటారు. అడిగింది పార్వతి. "నీ ఇష్టం తల్లీ" ఏదైనా చేసేయ్.

ఆ, చేసేదీ త్వరగా చేసెయ్ నేను ఈరోజు ఆఫీసుకు త్వరగా వెళ్ళాలి. పండుగ సెలవులు వస్తున్నాయని అప్పుడే సెలవు చీటీలు ఇచ్చారు, మా సిబ్బంది.... ఆఫీసుకు తయారు అవుతూ తొందర పెట్ట

సాగాడు భాస్కర్.

'మీ తొందర ఎప్పుడూ ఉన్నదే గదా' ! అంది పార్వతి.

తాతయ్యా ! మరి నాకు పట్టు పరికిణీ కుట్టించాలి.

పట్టు పరికిణీ ఏంటే.... పల్లెటూరి గబ్బిలంలా.

'ఏంచక్కా పంజాబీ డ్రెస్, లేదా జీన్స్ కొనుక్కో అన్నాడు శ్రీకాంత్, శ్రీ లక్ష్మిని ఆటపట్టిస్తూ.

అది నా మనుమరాలురా ! మన ఇంటి సంస్కారం కాపాడే చిన్నారి..... అంటూ దగ్గరకు తీసుకుంది, శారదమ్మగారు, శ్రీలక్ష్మి నానమ్మ ఒడిలో ఒదిగిపోయింది.

పొద్దుటి కార్యక్రమం టీ, టిఫిన్లు, ఆఫీసు హడావిడులు అయ్యే టప్పటికి పది దాటింది.

మధ్యాహ్నం భోజన సమయంలో..... 'అత్తయ్యా ! పండుగ ఇంకా వారం రోజులేవుంది. సరుకులు, బట్టలు.... ఇంకా కావాల్సిన వాటి గురించి జాబితా రాసివ్వండి, అంతే గాదు మీరు కూడా వస్తే ఇద్దరం కల్సి షాపింగ్ చేయెచ్చు' అంది పార్వతి.

సాయంత్రం అబ్బాయి, మీ మామగారు వచ్చిన తరువాత వారిద్దరిని అడిగి ఒకేసారి రాసుకుందాం, ఇంకా కొత్తబట్టలు మనకు, పనివాళ్ళకు కూడా కావాలి కదా... అంది !

"మీ ఇష్టం"

'పండుగకు అల్లుడూ, కూతురు వస్తారు గదా, వాళ్ళకోరికలేంటో, పుట్టింటి సంగతి తెలిసినా ఇంకా కూతురు మల్లిక బాధ్యత తెలుసుకోలేదు. పెళ్ళికెదుగుతున్న చెల్లి ఉందని కూడా గ్రహించదు. ఏదో ఆనవాయితీగా పండుగకు రమ్మంటాం... సరే వస్తె సంతోషమె, మరి తలకు మించిన కోరికలు కోరితే ఎలా. ఇప్పుడు మీ మామగారు, వి.ఆర్.ఎస్. తీసుకున్నారాయె. ఏం చేద్దాం' తన ఆలోచనను బయటకు పెట్టింది.

ఎంతైనా తను పరాయి పిల్లే గదా. ఏం చెప్పకుండా గమ్మున కూర్చుంది పేపరు చదువుతూ...

సాయంత్రం పెందలాడే తండ్రీ కొడుకులు వచ్చారు.


ఎన్నడూలేంది భాస్కర్ త్వరగా రావడం ఆశ్చర్యమైంది ఇద్దరాడాళ్ళకి.

"పార్వతీ తల పగిలిపోతూంది. మంచి కాఫీ పట్రా. కుర్చీలో జారగిలపడుతూ అడిగాడు.

ఏమండీ ! ఏమైంది, ఏమైన గొడవా, అంత నీరసంగా ఉన్నారు. ఆదుర్దాగా అడిగింది పార్వతి, భాస్కరు నుదుటిపై చేయి వేస్తూ.

ఏం లేదు. సెలవుల గొడవ. ఒక్కసారే ఐదుగురు సెలవు పెడితే ఆఫీసు పని ఏమవుతూంది. నేను కూడా సెలవు పెట్టేశా, ఓ వారం రోజులు. నా సెలవుచీటి మరి వాళ్ళ సెలవు చీటీలు హెడ్ ఆఫీసుకు పంపాను.... అంతే, చిరాగ్గా చెప్పాడు.

ఇక రామనాథం గార్కి పెన్షన్ పేపర్లు అందలేదని ఏ.జి. ఆఫీసు నుండి ఫోనులో చెప్పారు. అసలే బి.పి, కంగారుతో ఆఫీసుల చుట్టు తిరగడంలో రామనాధం గారు డీలా పడిపోయారు.




ఇలా రెండు రోజులు గడిచింది.

మొగవాళ్ళ మూడ్సు బాగాలేవని ఆడవాళ్ళు పండుగ ఊసు ఎత్తడం లేదు.

"అమ్మగారూ, పని మనిషి మెల్లగా శారదమ్మ గారి వద్దకు వచ్చి చేతులు నలుపు కుంటూ... నాకు రెండు రోజులు సెలవు యిప్పిం చండమ్మా, మా అల్లుడు బిడ్డ పండక్కి వస్తున్నారు" అంది.

"ఒసేవ్ ! నీవు కూడా పండక్కి ఎగనామం పెడతావటే' చిరాగ్గా అంది.

మరేనండీ ! మాకు చుట్టాలు వస్తారు కదండీ, మేం కూడా పండుగ చేసుకోవాలి కదండీ, ఎప్పుడైనా పనిమానానా. ఏదో పెద్ద పండుగ అని పిల్లలు వస్తున్నారు అందుకూ పండుగలకు రావడం లేదని ముందుగానే చెబుతున్నాను అంది పనిమనిషి మల్లమ్మ.

ఇంకా రెండు రోజులుంది గదే, ఎవరి నైనా పెట్టిపో... అంది శారదమ్మగారు.

అత్తయ్యగారూ ఏం చేద్దామండీ, పండుగ దగ్గర పడుతూంది. పనిమనిషి నమ్మకం లేదు, వదినా, పిల్లలు వస్తూన్నట్టు కబురొచ్చింది. కంగారుగా అంది పార్వతి.

నీవు కూడా నీ పుట్టింటికి పో... విసుగ్గా అంది శారదమ్మ.

నాకు వెళ్ళాలనే వుంది. అక్కడ వాళ్ళ పరిస్థితి ఎలాగ ఉందో, రెండు మూడు సంవత్సరాలాయె పండుగలకు వెళ్ళక... మనసులో దిగులుగా అనుకుంది పార్వతి.

ఇంతలో ఫోను మోగింది. హలో ! అమ్మా పార్వతీ ! బావున్నారా! అంటూ... అవతలివైపు పార్వతి నాన్నగారు శేషయ్యగారు పలకరించారు. ఆ మీరా నాన్నగారు, బావున్నాం. మీరు బావున్నారా ! అమ్మ బావుందా, చెల్లాయి, తమ్ముడు బావున్నారా...సంతోషం, ఆప్యాయతలు నిండిన కంఠంతో తండ్రిని అడిగింది.

ఆ అందరు బావున్నారు. అల్లుడు గారికి ఫోను చేస్తే కలువడం లేదు. ఇంటికి చేశాను. మీరు రాక రెండు మూడు సంవత్సరాలైంది. పండక్కి ముందే చెబుతున్నాను. వీలైతే నేనే వచ్చి అల్లుడిగార్ని, నిన్ను పండుగకు వచ్చి తీసుకెళ్తా. ఈలోగా ఒకసారి ఫోనులో చెబితే బావుంటుంది. మీ అత్తగారు, మామగారు న్నారా, ఒక్కసారి వారికి ఇవ్వమ్మా, నే మాట్లాడు తాను."

అత్తయ్యగారూ!మానాన్న మీతో మాట్లాడు

తారట... అంటూ ఫోను శారదమ్మగారికి ఇచ్చింది పార్వతి.

అన్నయ్య గారూ బావున్నారా? వదిన, పిల్లలు బావున్నారా, ఏంటీ పిల్లల్ని పండక్కి పంపించమంటారా, మా అమ్మాయి, అల్లుడు, పిల్లలు వస్తున్నారని కబురు చేశారు.

పార్వతి వాళ్ళ సంభాషణ వింటుంది.

ఇంతలోనే భాస్కరు కంగారుగ వచ్చాడు. "పార్వతీ, నేను ఖరగ్‌పూర్‌కు వెళ్ళాలి. అర్జంటుగా రీజినల్ ఆఫీసుకు బదిలీ చేశారు, వెంటనే జాయిన్ కమ్మని ఆర్డర్లిచ్చారు, ప్రమోషను ట్రైనింగ్ అంటూ.

భాస్కర్, "మీ అత్తగారు, మీ మామగారు పండక్కి రమ్మని ఫోను చేస్తున్నారంటూ ఫోను భాస్కరుకు యిచ్చింది. హలో మామగారూ బావున్నారా, నేను పండక్కి రాలేను, ఖరగ్‌పూర్‌కు బదిలీ చేశారు. ఈ సాయంత్రమే వెడుతున్నాను. పిల్లల్ని పంపమంటున్నారా, మీ అమ్మాయి యిష్టం. నాకు పని ఉంది ఉంటా"... అందరినీ అడిగానని చెప్పండి. ఏం చేస్తాం ఉద్యోగ ధర్మం మరి... అంటూ ఫోను పెట్టాడు.

పార్వతికి ఏం అర్థం కావడం లేదు.

భాస్కర్‌వెంట పార్వతి లోపలికి వెళ్ళింది. ఏం జరిగింది. మెల్లగా అడిగింది.

నన్ను రీజినల్ ఆఫీసుకు ప్రమోషన్ మీద బదిలీ చేశారు. వెంటనే జాయిన్ కావాలట.

మరి పండుగ సంగతి అంది.

పండుగ లేదు, గిండుగ లేదు. ఉద్యోగం కావాలనుకుంటే వెళ్ళి జాయిన్ కావాల్సిందే.

ఇంకా రెండు గంటలకు ట్రెయిన్ ఉంది, బయలు దేరాలి, బట్టలు సర్దిపెట్టు.

మరి నా సంగతి.

నీవు నీ పుట్టింటికి పో !

వదిన, పిల్లలు పండక్కి వస్తున్నారని కబురు వచ్చింది. నే వెడితే బావుంటుందా !

నీ ఇష్టం !

కాఫీ తెస్తాను... అంటూ తన భావాలు కనబడకుండా వెళ్ళింది.

రామనాథం గారు, "ఏంటీ అంతా పండుగ హడావిడి మొదలు అయినట్టు వుందే" కుర్చీలో కూర్చుంటూ అడిగాడు శారదమ్మను.


ఆ మొదలైంది హడావిడి, భాస్కర్ ఖరగ్‌పూర్‌కు అర్జంటుగ వెడుతున్నాడు. పార్వతి వాళ్ళింటి నుండి పండక్కి రమ్మని అన్నగారు ఫోను చేశారు. పనిమనిషి మల్లమ్మ రెండు రోజులు రానని చెప్పింది.

పిల్లలు, అల్లుడు గారు ఒకరోజు ముందే బయలు దేరుతున్నారట. ఇవి పండుగ హడావిడి విశేషాలు.

తాతగారూ ! నేను క్రికెట్ టీంలో సెలక్టు అయ్యాను. రేపు హైదరాబాద్‌కు వెళ్ళాలి... అంటూ హుషారుగా చెప్పాడు శ్రీకాంత్.

మమ్మీ, నా బట్టలు సర్దు, నేను ఈ రాత్రి హైదరాబాద్‌కు వెళ్ళాలి. మూడు రోజుల క్రికెట్ మ్యాచులున్నాయి. సంబరపడుతూ పార్వతితో అన్నాడు. ఏంటీ నాన్నగారు మీరు కూడా వస్తారా, హైదరాబాద్, బట్టలు సర్దుకుంటున్న నాన్నగారు వైపు చూస్తూ....

నేను ఖరగ్‌పూర్, నీవు హైదరాబాద్, మీ అమ్మ, చెల్లాయి, మీ అమ్మమ్మ వాళ్ళింటికి.




మరి తాతయ్య, నానమ్మ ఎక్కడ. పండుగ సంగతేంటి, నా పట్టు పరికిణి అంటూ.... అప్పుడే వచ్చి అడిగింది శ్రీలక్ష్మి.

ఇంతలో హాలులో ఫోను మోగింది. శారదమ్మ ఫోను ఎత్తి హలో ! అంది... 'అమ్మ! నేను గిరిజను, పండక్కి రావడం లేదు, చిన్న ఇబ్బంది వచ్చింది. మీరే రండి.

ఏంటే కంగారుగ అడిగింది, శారదమ్మ.

ఏం లేదు. మా చిట్టి పని పెట్టింది. అమ్మమ్మవు నీవు రావాలి అంది.

ఎవరే ఫోను చేసింది అంటూ భాస్కర్ సూటుకేసుతో బయటకు వచ్చాడు.

ఏం లేదురా ! ఆడవారి ఫంక్షను మీ చెల్లెలి ఇంట్లో మొదలైంది.

అయితే మీరు గిరిజ దగ్గరకు వెళ్ళండి. పార్వతి, వాళ్ళ పుట్టింటికి వెడుతూంది. శ్రీకాంత్ హైదరాబాద్‌కు వెడతాడు. పనిమనిషి కూడా రావడం లేదు గదా !

మరి పండుగకు ఇంట్లో దీపం పెట్టేది ఎవరురా.

మనమే లైట్లు వేసి ఉంచితే సరిపోలే... అన్నాడు శ్రీకాంత్.

నీతెలివికి సంతోషించాలే అంది పార్వతి.

'అనుకున్నది ఒక్కటి, అయిందొక్కటి బొల్తాకొట్టిందిలే బుల్ బుల్ పిట్టా......'

టీవిలో పాట వస్తుంది. టీవి కట్టేయండిరా... చిరాగ్గా అన్నాడు రామనాథం.

నాకు ట్రెనుకు టైం అవుతూంది. ఏదో ఒక నిర్ణయం తీసుకోండి.

పార్వతీ,నీవు శ్రీలక్ష్మితో పుట్టింటికి వెళ్ళు, నాన్నా మీరు ఏలూరుకు వెళ్ళండి, మరోసారి తన నిర్ణయం చెప్పాడు.

ఇంటికి తాళం వేయండి.

అంతేనేరా ! అంది శారదమ్మ.

ఏమోరా నాకు ఏం తోచడం లేదు. తలా ఒక దిక్కుకు పండుగపూట. అంది నిస్పృహగా శారదమ్మగారు.

ఆ ఁ ! వస్తాను, బై బై, జాగ్రత్త.

'నేను మిమ్మల్ని డ్రాప్ చేస్తాను' అంటూ శ్రీకాంత్ మోటారు సైకిల్ స్టార్ట్ చేశాడు.

పార్వతీ, భాస్కర్‌వైపు చూస్తు 'అలాగే' అంది దిగులుగా.

రామనాథంగారు తనలో తాను నవ్వు కుంటున్నాడు.

ఇదీ మధ్యతరగతి పండుగ సంబరం.